తేది: 05.10.2003, విజయదశమి, సాయికుల్వంత్ సభామండపం

# "నేను దేహస్వరూపుడను కాదు, ప్రేమస్వరూపుడను"

విష్ణువే గొప్పని వైష్ణవులనుచుండ
శంభుండు గొప్పని శైవులనగ
గణపతి గొప్పని గాణపతులు వల్క
శారద గొప్పని చదువరులన
అల్లా ఘనుండని ఆ తురకలు చెప్ప
శాక్తేయులందరు శక్తియనగ
నేను గొప్పయటంచు నాదు భక్తులు చెప్ప
అందరొక్కటెయని కొందరనగ
సర్వమత సమ్మతమ్ముగ సత్యమైన
బ్రహ్మమొక్కటెయని మీరు పలుకవలయు
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు?
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

మాటలందు తీపి మనసున చేదుంచ
మంచికాదు మీకు మచ్చగాని
మచ్చలేని బ్రతుకె మహిలోన చెల్లురా
వినుడు భారతీయ వీరసుతుడ

ప్రేమస్వరూపులారా!

భారతదేశమంతా దేవీనవరాత్రులు జరుపుకుంటున్నారు. కాని, నవరాత్రుల విశిష్టత ఏమిటో గుర్తించుటకు ఎవ్వరూ ప్రయత్నించుట లేదు. ప్రతి ఒక్కరి హృదయమూ

sri sathyasai vachanamrutam

పవిత్రమైన ఆత్మ స్థాయియే! ఆత్మలేని మానవుడు, ఆత్మలేని జీవులు ఎందునూ కానరారు. దైవము ప్రతి జీవియందు ఆత్మస్వరూపుడై ఉన్నాడు. భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపనామములు లేవు. కాని, మానవులు వారివారి భావములను పురస్కరించుకొని భగవంతునికి అనేక రూప నామములను కల్పించి ఆరాధన సల్పుతున్నారు. గణపతియే గొప్పవాడని గాణపతులంటారు. శివుడే గొప్పయని శైవులంటారు. రూపనామములు వేర్వేరుగా ఉండవచ్చునుగాని, భగవంతుడొక్కడే! అయితే, ఎవరి భావమునకు తగిన రూపములో వారికి గోచరిస్తాడు. కాబట్టి, ఎవరు ఏ రూపమును ప్రేమింతురో వారికి అదే గొప్ప! అయితే, ఒక రూపముకంటే మరొక రూపము గొప్ప అని చెప్పడం అజ్ఞానం. ముఖ్యంగా దేవీ ఉపాసనను, భగవత్ప్రార్థనను మాటలచేత కాక క్రియలచేత నిరూపించాలి. మాటలు ఎన్నైనా చెప్పవచ్చు. క్రియారూపమైన ఆరాధనయే నిజమైన ఆరాధన.

**ప్రతి జీవిని గౌరవించడమే నిజమైన దైవారాధన**

ఈ దేవీ నవరాత్రులలో దివ్యత్వమును అనేక పేర్లతో మీరు ఆరాధిస్తుంటారు. ఇవి ఎవరు నిర్ణయించినవి? ఎవరికి వారు నిర్ణయించుకున్నవేగాని, భగవంతునికి ఇది, అది అనే భేదము లేదు. దివ్యత్వం ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ నిర్ణయించ లేరు. అందరి హృదయంలో ఉన్న ప్రేమతత్త్వమే దైవత్వము. భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపం లేదు. ప్రేమయే దైవస్వరూపము. సత్యమే భగవత్స్వరూపము. సత్యము సర్వత్రా నిండినది.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునందణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న?
శుద్ధసత్త్వమిదియె చూడరయ్య!

ఇది అమెరికన్ సత్యము, ఇది జపాన్ సత్యము, ఇది రష్యన్ సత్యము, ఇది ఇండియన్ సత్యము అని సత్యమును విభజించుటకు వీలుకాదు. అందరి యందున్న సత్యస్వరూపము ఒక్కటే. అట్టి సత్యస్వరూపమును ధ్యానించడమే పండుగలు జరుపుకోవడంలోగల పరమార్థం. అందరియందు దివ్యమైన ఆత్మతత్త్వమున్నది. కాబట్టి, ప్రతి జీవిని



sri sathyasaivachanamrutam

గౌరవించడమే నిజమైన దైవారాధన. ఇతరులను మీరు గౌరవించకున్న మిమ్మల్ని ఇతరులు ఏరీతిగా గౌరవించగలరు? మొట్టమొదట మీరు ఇతరులను గౌరవించండి. అప్పుడే ఇతరులనుండి మీరు గౌరవము నందుకోవడానికి వీలౌతుంది. దైవత్వం అందరిలోను ఏకత్వంగా ఉన్నది. "ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి" ఎన్ని పేర్లు పెట్టినా దైవము ఒక్కడే! ఎన్ని రూపములు దాల్చినా దైవము ఒక్కడే! అట్టి ఏకత్వంతోకూడిన దైవత్వాన్ని మీ హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. సర్వులయందు ఏకంగా ఉన్నటువంటిది ప్రేమయే! కాబట్టి, ప్రేమను ఆరాధించండి. మీ ప్రేమను పరులకందించండి. వారి ప్రేమను మీరు అందుకోండి. ప్రేమకు ప్రేమయే సాక్షి. ప్రేమను మించిన ఫలము, ప్రేమను మించిన సౌఖ్యము, ప్రేమను మించిన ఆనందము మరొకటి లేదు. కనుక, మీ హృదయంలో ప్రేమను నింపుకోండి. పరమాత్ముడు ఎక్కడ, అని మీరు వెతుకనక్కర్లేదు. ప్రేమ ఉన్నచోటే పరమాత్ముడుంటాడు. ఎవ్వరినీ ద్వేషించకండి. ద్వేషము మీకు పరమ శత్రువు. మీలో ప్రేమను పెంచుకున్నప్పుడు శత్రుత్వము దూరమైపోతుంది. మీ విరోధి ఎదురైనా మీరు ప్రేమతో పలుకరించండి. వాడు కూడా మిమ్మల్ని ప్రేమతో పలుకరిస్తాడు. ఇతరులకు మీ ప్రేమను అందించకపోతే వారి ప్రేమను మీరు ఎలా అందుకోగలరు?

**దైవము మీనుండి ఆశించేది ప్రేమ ఒక్కటే**

సాయియొక్క ప్రచారప్రబోధలు ప్రేమతత్త్వం ఒక్కటే! ప్రేమను మించిన ఐశ్వర్యము లేదు. ప్రేమకు విలువకట్టడానికి వీలుకాదు. భగవంతుడు మీనుండి ఏమి ఆశిస్తున్నాడంటే, ఒక్క ప్రేమను మాత్రమే ఆశిస్తున్నాడు. ఈ దేవీ నవరాత్రులలో నవవిధములైన భక్తిమార్గములలో మీ ప్రేమను భగవంతునికి అర్పించాలి. ఏమిటా నవవిధములైన భక్తిమార్గములు?

శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం
వందనం అర్చనం దాస్యం స్నేహమాత్మనివేదనం

దైవమునకు ఇవ్వవలసినది ప్రేమ ఒక్కటే! లౌకిక విషయాలు కొమ్మలు, రెమ్మలవంటివి. ఇవి మధ్యలో పుట్టినవి. ప్రేమ మాత్రం స్వతస్సిద్ధముగా ఏర్పడినది. దానిని లౌకికవిషయాలపై

మరల్చకుండా నేరుగా దైవంవైపు ప్రవహింపజేయాలి. మీ హృదయాన్ని దయతో నింపుకోవాలి. అప్పుడే మీరు భక్తులనిపించుకోగలరు. 'సత్యం వద, ధర్మం చర,' ఈ రెండింటినీ మీరు అనుసరిస్తే దైవము మీవెంటనే, జంటనే ఉంటాడు. దేవీ నవరాత్రులను జరుపుకోవడంలోగల ముఖ్యోద్దేశమేమంటే, మీరు దయాస్వరూపులుగా మారాలి. ప్రేమస్వరూపులుగా రూపొందాలి. దయాప్రేమలు లేని హృదయం స్మశానము వంటిది. తెల్లవారి లేచిన తక్షణమే మీరు ప్రేమతత్త్వాన్ని స్మరించాలి. ప్రేమ మార్గాన్ని అనుసరించడానికి దీక్షబూనాలి. మీరు చేసే ప్రతి పనిలో ప్రేమ అంతర్వాహినిగా ప్రవహించాలి. అప్పుడే ప్రేమస్వరూపుడైన పరమాత్ముడు మీకు సాక్షాత్కరిస్తాడు.

ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమ ప్రేమతొ సంధింప నీమమగును
కాన ప్రేమను పూర్తిగ కలిగియున్న
అద్వితీయము చెందగ అర్హుడగును

ప్రేమచేత కఠినమైన శిలను కూడా వెన్నగా మార్చవచ్చు. స్వామి నిరంతరము ప్రబోధించేది ప్రేమయే! ప్రేమతో ఒక్కతూరి 'బాబా' అని పిలవండి. ఆ ప్రేమయే మీకు ప్రాణంగా నిలుస్తుంది. మీ పిలుపులో ప్రేమ లేకపోతే ప్రయోజనం లేదు. ప్రేమ అనేది 'హార్ట్ ఫుల్'గా ఉండాలేగాని, 'ఆర్టిఫీషియల్'గా ఉండకూడదు.

మీరు అందరితో స్నేహంగా మెలగాలి. మీ మోముపై నిరంతరము చిరునవ్వులు చిందులు త్రొక్కాలి. మీ హృదయంలో ప్రేమను నింపుకున్నప్పుడే ఇది సాధ్యమౌతుంది. ప్రేమయే జీవితము. ప్రేమ లేకుండా మీరు క్షణమైనా జగత్తులో నిలువడానికి వీలుకాదు. కాబట్టి, ప్రేమయే పరమాత్మస్వరూపమని విశ్వసించి, ప్రేమను పెంచుకోండి. ఈ నవరాత్రులలో దేవీ ఆరాధనయొక్క అంతరార్థ మేమిటి? చెడ్డను దూరం చేసి మంచిని పెంచుకోవాలి. మీరు చెడ్డను ఎంత దూరం చేసుకుంటారో ప్రేమ మీకు అంత దగ్గరగా వస్తుంది. ప్రేమను ప్రత్యేకంగా పిలువ నక్కర్లేదు, తనంతట తానే వస్తుంది.

**నేను, మీరు ఒక్కటే**

విద్యార్థులారా! మీ అందరిలోను ప్రేమ ఉన్నది. ఆ ప్రేమను ప్రాకృతమైన ప్రేమగా



sri sathyasai vachanamrutam

మార్చుకోకండి. దానిని ఆత్మస్వరూపంపై నిల్పుకోండి. ఆధ్యాత్మిక ప్రేమయే నిజమైన ప్రేమ. పదార్థసంబంధమైనది ప్రాకృతప్రేమ. అది మార్పుచెందుతుంది. ఆత్మ సంబంధమైన ప్రేమయే శాశ్వతమైనది. "ప్రేమ రూపము బ్రహ్మంబు ప్రేమమయము." ప్రేమకే బ్రహ్మ అని పేరు. 'సో...హం, సో...హం...' అంటూ మీ ఉచ్ఛ్వాసనిశ్వాసములు ఆడడానికి కూడా ప్రేమయే కారణం. 'సోహం' అనగా 'అది నేనే.' అదే ప్రేమ. అది అందరియందున్నది. ప్రేమ లేనిదే ప్రాణమే లేదు. కనుక, I and you are one (నేను, మీరు ఒక్కటే) అనే సత్యాన్ని గుర్తించండి. భేదానికి అవకాశమివ్వకండి. మీరు వేరు, నేను వేరు అని భావించడంచేతనే ప్రేమ కూడా వేరైపోతున్నది. హృదయము ఒక్కటే. అది క్షణక్షణమునకూ మారునది కాదు. మీరు మాటలు మార్చినా హృదయం మాత్రం మారదు. అందుకోసమే గోపికలు చెప్పారు:

"ఏ హృదయము నొసంగితివో ఈశ నాకు
మగిడి దానినే యర్పింతు మహితమూర్తి
పరగ వేరేమి తెత్తు నీ అర్చనకును
అంజలి ఘటింతు, అందుకోవయ్య నీవు"

భగవంతునికి ప్రేమఫలంగా మీ హృదయాన్ని అర్పించాలి. అది భగవంతుని సొత్తేగాని, మీ సొత్తు కాదు. మీ ప్రాపర్టీ ఈ జగత్తులో ఏ ఒక్కటీ లేదు. భౌతికమైన ప్రాపర్టీలు స్థిరమైనవి కావు. "అనిత్యం అసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మాం," అన్నాడు గీతాచార్యుడు. దైవప్రేమ ఒక్కటే శాశ్వతమైనది. మీరు మారినా అది మారదు. దిక్సూచి యంత్రమును ఎక్కడ పెట్టినా దాని ముల్లు ఉత్తరదిశనే చూపిస్తుంది. అదేరీతిగా, మీ ప్రేమ ఎటువంటి పరిస్థితులందైనా దైవము వైపే ప్రవహించాలి. మీలో Kindness (దయ) లేకపోతే మీది Mankind (మానవజాతి) అని చెప్పడానికి వీలుకాదు. కాబట్టి, మీరు దయా హృదయులుగా రూపొందండి. ప్రేమకు మీ జీవితాన్ని అర్పితం గావించండి. మీరు చేయ వలసింది అదియే! "నేను భగవంతుణ్ణి ఏవిధంగా ప్రార్థించాలి?" అని కొందరడుగుతారు. కాని, మీరు ప్రార్థన కూడా చేయనక్కర్లేదు. మీ ప్రేమను దైవానికి అర్పితం గావిస్తే చాలు. నా ప్రేమ మీది. మీ ప్రేమ నాది. మీరు, నేను ఒక్కటే. రెండవ పదార్థమే లేదు.

sri sathyasai vahanmritam

## పరమాత్మను ఒక ఆకారానికి పరిమితం చేయవద్దు

దివ్యాత్మస్వరూపులారా! మీరు దేహాన్ని ధరించారే గాని, దేహతత్త్వమును మీరేమాత్రము అర్థం చేసుకోవడం లేదు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు, గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహనిబంధ బంధనలు ముద్రలు లేవు నిజంబు చూడ యా
దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

గుణములతోకూడిన పాంచభౌతికమైన దేహము మీరు కాదు. 'ఇది నా శిరస్సు, ఇది నా హస్తము, ఇది నా గుండె', అని అంటుంటారు కదా! మరి 'నేనెవరు?' అని ప్రశ్నించుకోండి. ఈ ప్రశ్న వేసుకుంటే శిరస్సు, హస్తము, గుండె మొదలైన అంగములన్నీ మీకంటే వేరుగా ఉన్నాయని స్పష్టమౌతుంది. అంగములతో కూడినది దేహము. మీరు దేహస్వరూపులు కారు. దేహములోని ప్రతి అంగములోను భగవంతుడు రసస్వరూపుడై సంచరిస్తున్నాడు. కనుకనే, భగవంతుణ్ణి 'అంగీ రసాయనమః' అని స్తుతిస్తున్నారు. రసస్వరూపుడైన పరమాత్మను ఒక ఆకారానికి పరిమితం చేయడం అజ్ఞానం. అలాంటివారికి భగవంతుడు చిక్కడు. రసస్వరూపమైన నిరాకారతత్త్వమును స్మరించాలి. భౌతికమైన ఆకారము మార్పుచెందునటువంటిదే! ఈరోజు బాలుడు... రేపు యువకుడు... ఎల్లుండి వృద్ధుడు. ఈరీతిగా, దేహము మార్పుచెందుతూనే ఉంటుంది. కాని, నీవు ఏనాటికీ మార్పు చెందవు. నీవు దైవస్వరూపుడవు. ఈ సత్యాన్ని గుర్తిస్తే భౌతికమైన మార్పులు నీపై ఏమాత్రము ప్రభావము చూపలేవు.

## ఆకారాన్ని కాదు, ఆత్మస్వరూపాన్ని విశ్వసించండి

స్వామికి కొన్ని దినములనుండి ఆరోగ్యం సరిలేదని మీరు అనుకుంటున్నారు. My health is very good, very good, very good. ఆరోగ్యమనేది దేహానికి సంబంధించినది. కాని, నేను దేహమునకు సంబంధించినవాడను కాను. మీరు నన్ను దేహస్వరూపునిగా భావించడంచేత ఆరోగ్యం సరిలేనట్లుగా మీకు కనిపిస్తున్నది.

sri sathyasaivacharamrutam

"యద్భావం తద్భవతి". మీరు నన్ను దేహస్వరూపునిగా భావించకండి. నేను దేహిని. నాకు, మీకు భేదము లేదు. నాలో సర్వశక్తులూ ఉన్నవి. పరులను సంతృప్తిపెట్టే నిమిత్తమై, డాక్టర్లను సంతృప్తిపెట్టే నిమిత్తమై నేను ఈవిధంగా నడుచుకుంటున్నానేగాని, నాలో ఎట్టి అనారోగ్యమూ లేదు. ఎప్పుడూ నేను ఆరోగ్యవంతునిగానే ఉన్నాను. కేవలం ఈనాడే కాదు, **96 సంవత్సరముల వరకు నేను ఇట్లనే ఉంటాను.** నేను ఏమి కావలసినా చేయగలను. కాని, ఈ దేహమును ఆధారం చేసుకున్నవారికి వృద్ధాప్యం కనిపిస్తుంది. కాని, నాకు వృద్ధాప్యము లేదు. నేను ఎప్పుడూ ఒక్కటే. ఏది కావలసినా నేను చేసుకోవచ్చు. అయితే, ఇది మీ దేహము. ఇది మీ నిమిత్తమై ఏర్పడినది. మీరు మార్చుకుంటే ఏరకంగానైనా మారుతుంది. 'మా స్వామి గట్టిగా ఉన్నాడు,' అనుకోండి. నేను తప్పక గట్టిగానే ఉన్నాను. నాకేమాత్రము బలహీనత లేదు. నా అంగములు బలహీనముగా కనిపించవచ్చు. కాని, నాది ఆత్మస్వరూపమేగాని, అంగ స్వరూపము కాదు. ఎప్పుడైనా సరే, మీరు దైవాన్ని ఆత్మస్వరూపునిగా భావించండిగాని, ఆకారస్వరూపునిగా భావించకండి. దేహాభిమానమును ప్రక్కకు నెట్టండి. ఆత్మస్థాయిని మీరు విశ్వసించండి. ఆధ్యాత్మికతను అభివృద్ధి పరచుకున్నప్పుడే మీకు ఆత్మస్వరూపము అర్థమవుతుంది. చూడండి మీరు ... ఆకారాన్ని స్మరిస్తే నేనిప్పుడు రెండడుగులు కూడా వేయలేను. కాబట్టి, ఆకారాన్ని తలచకుండా కేవలం ఆత్మస్వరూపాన్నే విశ్వసించండి. ఆత్మనే ప్రాణంగా తీసుకోండి. నేనెప్పుడూ చక్కగా, ఆరోగ్యంగానే ఉంటాను.

**స్వామికి ఆకారం ప్రధానం కాదు, ఆనందమే ప్రధానం**

విద్యార్థులారా! మీ అందరికీ ఇటువంటి శక్తి ఉంది. కాని, మీ శక్తిని మీరే చేతులారా పాడు చేసుకుంటున్నారు. మీ యౌవనమంతా మీ చేతిలో ఉంటున్నది. మీ ప్రాణశక్తి అంతా మీ చేతిలో ఉంటున్నది. ప్రాణశక్తియే మీరుగాని, దేహశక్తి మీరు కాదు. దేహమును కేవలం ఒక పనిముట్టుగా తీసుకొని వచ్చారు. (టేబుల్‌పై నున్న వెండిగ్లాసును చూపిస్తూ) ఇదొక టంబ్లరు. ఇందులో నీరుంది. నీటికి ఆధారం టంబ్లరు. టంబ్లరుకు ఆధారం వెండి. మరి వెండికి ఆధార మేమిటి? అదియే భగవత్స్వరూపము. అదియే విష్ణుస్వరూపము. అది పదార్థముతో చేయబడినది కాదు. పదార్థదృష్టికి పదార్థముగానే గోచరిస్తుంది. కాబట్టి,

srisathyasaivachanamrutam

పదార్థదృష్టిని దూరం చేసుకోండి. 'మా స్వామికి ఆకారము ప్రధానం కాదు, ఆనందమే ప్రధానం' అని గుర్తించండి. ఆనందస్వరూపాన్ని చింతించండి. తప్పక మీలో ఆనందం ఆవిర్భవిస్తుంది. "గత వారం దినములనుండి ఎంతోమంది మాట్లాడారుగాని, మా స్వామి ఒక్కమాటైనా మాట్లాడలేదే," అని చాలామంది విచారిస్తున్నారు. నా తత్త్వం ఎప్పుడూ ప్రేమతో కూడినటువంటిదే! నేను మీ మధ్యలోకి వచ్చినప్పుడు నాకు ఎంత ప్రేమ, ఎంత బలము, ఎంత ఆనందము, ఎంత ఉత్సాహము కల్గుతాయో చెప్పడానికి వీలుకాదు. నాకు ఆహారవిహారములు కూడా అవసరం లేదు. ఆనందమే నాకు ఆహారము. మీరుకూడా ఆరకంగా భావించుకోవాలి.

### మాయయొక్క ప్రభావం

విశ్వామిత్రుడు తన యాగసంరక్షణార్థం రామలక్ష్మణులను తనవెంట తీసుకొని వెళుతూ సరయూ నదీతీరమువద్ద వారికి బల, అతిబల అనే రెండు మంత్రములను ఉపదేశించాడు. "నాయనలారా! మీరు నావెంట రావడం విహారం కోసం కాదు; యజ్ఞసంరక్షణకోసం వస్తున్నారు. అందునిమిత్తం మీరు నిద్రాహారములు లేకుండా రాత్రింబవళ్ళు రాక్షసులతో పోరాడవలసి ఉంటుంది. ఈ రెండు మంత్రములను జపించడంద్వారా మీరు నిద్రను, ఆకలిదప్పులను జయించి నిర్విఘ్నంగా యాగ సంరక్షణ చేయగలరు," అని చెప్పాడు. ఇదే మాయ యొక్క ప్రభావం. రామలక్ష్మణులకు రాక్షసులేమైనా హాని తలపెడతారేమోనని దశరథుడు భయపడినప్పుడు విశ్వామిత్రుడు ఏమని చెప్పాడు? "దశరథ మహారాజా! నీవు పుత్రవాత్సల్యంలో మునిగి నీ కుమారులను సామాన్యమైన బిడ్డలుగా భావిస్తున్నావు. వీరు సాక్షాత్తు దైవస్వరూపులు," అని చెప్పాడు. తరువాత సరయూ తీరములో వారికి మంత్రోపదేశము చేశాడు. "మీరు దేహస్వరూపులు కాదు, ఆత్మస్వరూపులు. చైతన్యశక్తికి మించినది మీలో ఉన్నది. ఆ శక్తిని మీరు కాపాడుకుంటే మీకు ఆకలిదప్పులే ఉండవు," అని చెప్పాడు. రామలక్ష్మణులు విశ్వామిత్రునితో కలిసి 16 దినములు మిథిలానగరానికి ప్రయాణం చేశారు. అయినప్పటికీ వారేమాత్రం అలసట చెందలేదు. ఎక్కడికి పోయినా ఆనందమే! ఆనందమే రాముని స్వరూపం. అట్టి ఆనందమును మీరు పెంచుకోండి.

sri sathyasai vahanamrutam

భగవంతుణ్ని ఒక ఆకారానికి పరిమితం చేయవద్దు. ఆనందమే భగవత్స్వరూపం. దేహమనేది ఆహార సంబంధమైనది. నేను దేహము కాదు.

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాతసం**
**చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం**
**బులపొది లెమ్ము చూడ మనమెచ్చు దలంప దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరిపాదములాశ్రయింపవే!**

దేహాభిమానమును త్యజించండి. ఆత్మాభిమానమును పెంచుకోండి. అప్పుడే మీరు ఆత్మస్వరూపులుగా మారిపోతారు. లేకపోతే కాలినొప్పి, చెవినొప్పి, తలనొప్పి ఇలాంటి నొప్పులంతా వస్తుంటాయి. దేహము శాశ్వతము కాదు. మీకు దేహాభిమానము ఉన్నంతవరకే ఈ నొప్పులు! దేహభ్రాంతిని త్యజించిన తరువాత మీకు ఈ దేహముతో సంబంధమే ఉండదు. మీరు ధ్యానములో కూర్చున్నప్పుడు దేహాన్ని మరచిపోవాలి. ధ్యానమంటే ఏమిటి? దేహాభిమానాన్ని త్యజించి ఆత్మాభిమానాన్ని పెంచుకోవడమే! మీరు దేహానికి సంబంధించినవారు కాదు. దేహము కేవలం ఒక పనిముట్టు. మీరు 'నేను' అనే పదాన్ని ఉపయోగిస్తుంటారు కదా! ఆ 'నేను' అనేదే మీ నిజస్వరూపం. ఎన్ని 'నేను'లను కలిపినా అది 'నేను'గానే ఉంటుంది. అట్టి ఏకత్వము అందరిలోను ఉన్నది; నీవు, నేను అనే భేదము లేదు. మీరు దేహాభిమానమును పెంచుకుంటూపోతే మీరు చదివే చదువులు, చేసే సాధనలు అన్నీ వ్యర్థమైపోతాయి. మీరు దేహము కాదు. మీరు నేనే! ఆ నిజమైన 'నేను'ని ఆధారం చేసుకోండి. ఆకారము మార్పు చెందుతుందిగాని, 'నేను' అనేది మార్పు చెందదు.

ప్రేమస్వరూపులారా! దేవీ నవరాత్రులను జరుపుకోవడమంటే దేహాభిమానమును త్యజించి, ఆత్మాభిమానమును పెంచుకోవడమే! క్రమక్రమేణ దేహాభిమానమును త్యజించుకుంటూపోండి. మీరెంత గొప్ప వారవుతారో మీరే చూసుకోవచ్చు. దేహాభిమానము ఉన్నంతవరకు చాలా బలహీనంగా ఉంటారు. ఆత్మాభిమానమును పెంచుకుంటే బలహీనత భస్మమైపోతుంది; 'నేనే దైవం' అనే సత్యాన్ని మీరు అనుభవించగల్గుతారు.

(తేది: 05.10.2003, విజయదశమి, సాయికుల్వంత్ సభామండపం)

sri sathyasai vacharamrutam